
క్లుప్తంగా

శాకంబరిగా దుర్గమ్మ



బి.సావరంలో శాకంబరిగా విజయ కనకదుర్గాదేవి

అంబాజీపేట: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులు, భక్తులు సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని కనులవిందుగా అలంకరించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్య కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకంబరిగా విజయ కనకదుర్గాదేవి

కొత్తపేట/ఆలమూరు: స్థానిక బొరుసువారిసావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారు ఆషాఢ మాసం పౌర్ణమి నాడు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. అలాగే ఆలమూరులో వేంచేసిన గ్రామ దేవత రావులమ్మ వారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. 150 కిలోల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు, గణపతి హోమం జరిగాయి.

ఆక్రమణకు గురైన మురుగునీటి డ్రైన్ తూరలు


అంబాజీపేట: పంట పొలాల్లోని మురుగునీరు వెళ్లే డ్రైన్‌లు ఆక్రమణకు గురయ్యాయని వాటిని అడ్డుకుని రైతులకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ టి.మంగతాయారును ఇసుకపూడి బందగట్టు ప్రాంత రైతులు కోరుతున్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు తూరలను మూయకుండా చర్యలు తీసుకోవాలంటూ సోమవారం వినతిపత్రం అందజేశారు. బందగట్టు ప్రాంతం ఏరియాలో సుమారు 35 ఎకరాల వరి సాగు చేస్తున్నామని, ఈ భూములను ఆనుకుని కొంత మంది లే అవుట్ చేసి మురుగునీరు వెళ్లే తూరలను మూసివేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం నుంచి వరి చేలల్లో మురుగు ఈ తూరల నుంచే బయటకు వెళుతుందన్నారు. ఈ తూరలు మూసివేయడం వల్ల మురుగు బయటకు వెళ్లే మార్గం లేదని, తక్షణమే ఆక్రమణకు గురైన తూరలను మూసివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను రైతులు కోరారు.

ఎంఈఓ–1గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ



మామిడికుదురు: మండల విద్యాశాఖాధికారి(ఎంఈవో)–1గా నియమితులైన ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ–1గా బాధ్యతలు చేపట్టారు. కోరుకొండ ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఎంఈఓ–1గా ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంఈఓ–1గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణను పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ ఉద్యోగులు అభినందించారు.

ఎంఈఓ–1గా వెంకటేశ్వరరావు



అంబాజీపేట: మండల గ్రేడ్–1 ఎంఈవోగా కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనాతవరంలో జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు పదోన్నతిపై వచ్చినట్లు ఆయన తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంఈఓ–1గా మనోహరం

రాజోలు: ఎంఈవో–1గా నల్లి మనోహరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించిన ముంగండ విజయశ్రీ, ఎంఈఓ–2 ప్రసాదరావు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ మనోహరానికి అభినందనలు తెలిపారు.

ఎంఈఓ–1గా క్రిస్టోఫర్

రావులపాలెం: ఎంఈవో–1గా డి.క్రిస్టోఫర్ కర్నోలియస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపేట హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న క్రిస్టోఫర్ రావులపాలెం ఎంఈఓ–1 గా నియమితులయ్యారు. ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

మత విభేదాలు సృష్టిస్తున్నారు

అంబాజీపేట: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మత విద్వేష రాజకీయాలతో దేశ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయని పీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. అంబాజీపేటలో గ్రామ గ్రామానికి కాంగ్రెస్ పేరుతో బైక్ ర్యాలీని సోమవారం నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక లోడు.. అనర్థాలు తోడు

- ఊక లారీలతో ట్రాఫిక్‌జామ్
- అధికారుల స్పందన అంతంతే

ఆలమూరు: వాహనాల రద్దీ, ఇరుకు రోడ్లతో సతమతమవుతున్న ప్రజానీకానికి భారీ లోడుతో వెళుతున్న ఊకలారీలు అనునిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఊక, బూడిద రవాణా చేస్తున్న లారీలకు ఇరువైపులా మీటరు మేర వెడల్పుగా, ఉబ్బెత్తుగా సరకు నింపడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రయాణికులకు కనిపించడం లేదు. సుదీర్ఘ సమయం ప్రయాణించిన తరువాత ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే అధిక లోడుతో వెళుతున్న వాహనాన్ని అధిగమించవలసిన పరిస్థితి. నిబంధనలకు విరుద్ధంగా అధిక టన్నులతో ప్రతి రోజు ఉదయం వేళల్లో పదుల సంఖ్యలో లారీలు మండపేట వైపు, వెదురుమూడి వైపు ప్రయాణించడం వల్ల వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై ఊక లారీలు స్వారీ చేయడం వల్ల సాఫీగా ప్రయాణించడం ప్రాణసంకటంగా మారింది. ఒక్కోసారి లారీలకు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే రోడ్డు మీదనే నిలిచిపోవడం ప్రయాణికులకు శాపంగా పరిణమిస్తోంది. అధిక లోడును నివారించవలసిన ఆర్‌టీఓ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రవాణాశాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.



ఆలమూరు–మండపేట రహదారిపై ప్రయాణిస్తున్న ఊకలారీ

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చనే అభిప్రాయం పర్యావరణవేత్తల నుంచి వ్యక్తమవుతుంది. అధికలోడు ప్రయాణం నివారిస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం సులభం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



పరిమితికి మించి లోడు వేసుకుని ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు డ్రైవర్లకు అధిక లోడు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాం. ఊక, బూడిద తరలించే వాహనదారులు తప్పనిసరిగా టార్పాలిన్లు ఏర్పాటు చేసుకుని ప్రయాణికులుకు అంతరాయం కలుగకుండా చూడాలి.

– డి.అశోక్ ప్రతాప్‌రావు, డీటీఓ, అమలాపురం

పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

రావులపాలెం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వ అందిస్తున్న వివిధ పథకాలపై తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచ్ బి.కరుణాకరం, ఉపసర్పంచ్ అల్లం అచ్చమ్మ, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, ఎంఈఓ–2 బి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

పి.గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పడ్డ సాంకేతిక లోపాలను సరిజేసి, సోమవారం నుంచి అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించినట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. ఈనెల ఒకటో తేదీ రాత్రి నుంచి ఏర్పడ్డ సాంకేతిక లోపాల వల్ల విద్యుత్ సరఫరాలో కాస్త అంతరాయం ఏర్పడిందని ఆయన తెలిపారు.

జనమంతా.. జగనన్న వెంటే..

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ వెంటే రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, ఎల్లో మీడియా కలసి ప్రభుత్వంపై ఎంత దుష్ప్రచారం చేస్తున్నా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన అన్నారు. నాగుల్లంకలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కారుపల్లి సునీత, సొసైటీ కమిటీ చైర్మన్ భీమాల సూరిబాబు, పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, బొక్కా ఏడుకొండలు తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చిట్టిబాబు ఆదేశాలు ఇచ్చారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, నాయకులు కారుపల్లి శ్రీనివాస్, మంగం వినోద్, గ్రంధి మురళి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాగుల్లంకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పాత వీవోనే విధుల్లోకి తీసుకోవాలి

అంబాజీపేట: డ్వాక్రా మహిళా సంఘాల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మానేసిన పాత వీఓ పేరాబత్తుల శేషవేణిని విధుల్లోకి తీసుకోవాలని వాకలగరువు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు కోరారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాత వీవోను విధుల్లోకి తీసుకోవాలంటూ సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో శేషవేణి డ్వాక్రా సంఘాలకు వీఓగా విధులు నిర్వహిస్తూ మానేశారన్నారు. అనంతరం గ్రామంలో 50 మహిళా సంఘాలు ఉండగా 25 సంఘాల ఒకరి చొప్పున వీఓను ఏర్పాటు చేశారు. అయితే ఇద్దరు వీవోల వలన మాకు ఎటువంటి పనులు జరగడం లేదని, సమాచారం కూడా ఇవ్వడం లేని కారణంగా ఆమె వీఓను వదిలేసిందన్నారు. ఈ ఖాళీగా ఉన్న వీఓ పోస్టులో శేషవేణిని నియమించాలని 25 సంఘాల సభ్యులు కోరుతున్నామని తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ కె.సత్యనారాయణలకు వివరించారు.



అంబాజీపేటలో తహసీల్దార్, ఎంపీడీఓలకు వివరిస్తున్న డ్వాక్రా మహిళలు

సంక్షిప్తంగా..

ఆరు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

మామిడికుదురు: పెదపట్నంలంక నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లతో పాటు ఒక జేసీబీని సీజ్ చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా సోమవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు అర్ధరాత్రి దాడి చేసి మట్టిని ఎగుమతి చేస్తున్న జేసీబీతో పాటు మట్టి లోడుతో ఉన్న ట్రాక్టర్లు, మట్టి లోడు చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. వాటిని రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశామని చెప్పారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

మొగలికుదురులోని కొబ్బరి తోటలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామని నగరం ఎస్సై ఎస్‌కే జానీబాషా సోమవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడి చేసి పేకాడుతున్న వారిని అరెస్టు చేసి రాజోలు కోర్టులో హాజరు పర్చామన్నారు. వారి నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న అయిదుగురిని అరెస్టు చేశామని చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం: మండలంలోని మొండెపులంకలో 19 ఏళ్ల యువతి అదృశ్యమైన సంఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మలికిపురం మండలం గొల్లపాలేనికి చెందిన 19 ఏళ్ల యువతి తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లడంతో, ఆమె మొండెపులంకలోని మేనత్త ఇంటి వద్ద ఉంటోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లు గాలించినా యువతి ఆచూకీ తెలియలేదు. దీంతో మేనత్త సోమవారం రాజేష్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడిలో పేకాడుతున్న నలుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై వై.కిరణ్‌కుమార్ కథనం ప్రకారం గ్రామ శివార్లలో పేకాడుతున్నారనే సమాచారంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8460 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సఖినేటిపల్లి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోనసీమ దివ్యాంగుల సంఘం, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం మోరిపోడులో కమిటీ మెంబర్ పితాని ఏసుబాబు అధ్యక్షతన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం జరిగింది. దివ్యాంగుల హక్కుల చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలని, పింఛన్ రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచాలని, కుటుంబానికి 35 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలని వంటి తీర్మానాలను ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఉప సర్పంచ్ వాతాడి కొండబాబు, జేపీసీ అధ్యక్షుడు బొమ్మిడి నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

రావులపాలెం: గోపాలపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గోపాలపురం సత్యనారాయణ రాజు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి నూతనంగా నియమితులైన త్రీమెన్ కమిటీ చైర్మన్ తేతలి సత్యనారాయణ రెడ్డి, సభ్యులు చిట్టూరి లోవరాజు, పడాల రామకృష్ణారెడ్డిలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రమాణం చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

భారీ వర్షంతో సేద తీరిన ప్రజలు

మామిడికుదురు: తీవ్రమైన ఎండ, వేడి గాలులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. ఈదురు గాలుల ప్రభావానికి పాశర్లపూడిబాడవ జగతావారి వీధిలో గారపాటి సత్యనారాయణ ఇంటిపై కొబ్బరి చెట్టు విరిగిపడింది. దీంతో ఇంటి పైకప్పు దెబ్బతింది. బి.దొడ్డవరంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడింది. దీంతో కరెంటు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

మామిడికుదురు/అంబాజీపేటలమూరు/కొత్తపేట/రాజోలు/సఖినేటిపల్లి/మలికిపురం: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం మండలంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెదపట్నం షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సాయినాథునికి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర పుష్పార్చన, సామూహిక శ్రీసాయి సత్య వ్రతాలు, విశేష అన్న సమారాధన, బాబా ఊరేగింపు, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మొగలికుదురు ఆలయం వద్ద పాలు, విభూదితో ప్రత్యేక అభిషేకాలు, సత్యసాయి వ్రతాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అలాగే పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిపించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలోని గురుదత్త సద్గురు షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలమూరులోని షిర్డీసాయి ఆలయంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు నేతృత్వంలో బాబాకు అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని ఆలయాల వద్ద భారీ అన్నసమారాధన చేశారు. కొత్తపేట మండలంల వాడపాలెం సిద్ధివినాయకస్వామి, షిర్డీసాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పెదపూడి బాపిరాజు పర్యవేక్షణలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. నిట్ల సత్యనారాయణ మాస్టారును ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. రాజోలు సాయిబాబా ఆలయం నుంచి రాజోలు వశిష్టా గోదావరి తీరం వరకు జరిగిన శోభాయాత్రలో పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో కోలాటం భజనలో పాల్గొన్నారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాస పూర్ణిమ పురస్కరించుకుని గురువులకు, పెద్దలకు స్థానిక ప్రముఖులు సత్కరించారు. అలాగే మట్టపర్రులోనూ గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు.

వ్యాపారాభివృద్ధితో సొసైటీలు బలోపేతం

కొత్తపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (సొసైటీలు) రైతులకు రుణ సౌకర్యం కల్పించడంతో పాటు ఎరువులు, పురుగు మందులు వంటి వివిధ వ్యాపారాలతో ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు సూచించారు. మండలంలోని వానపల్లి సొసైటీ భవనం, గొడౌన్లపై నూతనంగా రూ.70 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని సోమవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆకుల వీర్రాజు ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు (రాజా) అధ్యక్షతన జరిగిన సభలో జగ్గిరెడ్డి, వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వీర్రాజు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ర్యాలి, వానపల్లి సొసైటీలు ప్రగతి పథంలో నడుస్తున్నాయన్నారు. ఒకటి రెండు సొసైటీలు 25 ఎకరాల వరకూ లీజుకు తీసుకుని వ్యవసాయం కూడా చేస్తున్నాయన్నారు. కొన్ని సొసైటీలు ఇతర వ్యాపారాలు కూడా చేస్తున్నాయన్నారు. ఈ వానపల్లి సొసైటీని ప్రెసిడెంట్ రాజా రూ.80 లక్షల టర్నోవర్ నుంచి రూ.24 కోట్లకు తీసుకువచ్చారంటూ అభినందించారు. ఆయనను, ఈ సొసైటీని ఇతర సొసైటీలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ వానపల్లి లాంటి గ్రామీణ ప్రాంతం చుట్టుపక్కల పెళ్లి, ఇతర శుభకార్యాలు జరుపుకోవడానికి ఫంక్షన్‌హాలు లేని పరిస్థితుల్లో ఈ సొసైటీ ద్వారా నిర్మించిన కల్యాణమండపం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జగన్ ప్రభుత్వం సహకార రంగానికి వివిధ రూపాల్లో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి బాబి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు, పర్సన్‌లు, నియోజకవర్గంలో పలువురు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండప శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

'జగనన్న సురక్ష'తో ఉచిత సేవలు

మామిడికుదురు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాజా కార్యక్రమం జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో సోమవారం జరిగిన సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న పలువురికి ఎమ్మెల్యే చిట్టిబాబు సర్టిఫికెట్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా పరిష్కరించిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, తవిటికి వెంకన్నబాబు, జాలెం కృష్ణారావు, తాడి రామకృష్ణ, వానరాశి వెంకటేశ్వరరావు, వానరాశి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జగనన్న సురక్షలో ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇస్తామని మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. వాకలగరువు, తొండవరంలో సోమవారం జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, పితాని వీరాస్వామి, పెచ్చెట్టి రాంబాబు, నాగాబత్తుల శశి, పేరాబత్తుల మల్లిబాబు, పేరాబత్తుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సర్పంచ్ నాగమణి, ఉప సర్పంచ్ మునిరెడ్డి

రావులపాలెంలో..

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వేమన కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ (రెడ్డి కల్యాణమండపం) బిల్డింగ్‌లో సచివాలయాలు 1,2 పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉపసర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాకా మణికుమారి, ఎండీపీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, ఏఓ బీనా తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని చెముడులంక–2, ఆలమూరు–1 గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, నేలపూడి లావణ్య అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాల ఏర్పాటు జరిగింది. తహసీల్దార్ ఐపి.శెట్టి, ఎంపీడీఓ కె.జాన్ లింకన్ నేతృత్వంలో రెండు అధికార బృందాలు అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. కార్యక్రమాల్లో నామాల శ్రీనివాసు, యనమదల నాగేశ్వరరావు, కార్యదర్శులు కె.సంజీవరెడ్డి, యు.రేణుక తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని ఎంపీడీఓ ముత్యం వీరా స్వామినాయుడు పేర్కొన్నారు. మండలంలోని చింతలమోరి, జి.పల్లిపాలెం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష నిర్వహించారు. అర్హులైన, దరఖాస్తు చేసుకున్న పౌరులకు 452 ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఈఓపీఆర్‌డీ బి.మంగా దేవి, డీటీ సీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులతో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద 'జగనన్న అమ్మఒడి' పథకం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా జగన్ ప్రభుత్వం వినూత్న సంక్షేమ పథకాలతో చరిత్ర సృష్టిస్తుందన్నారు. కొత్తపేట మండలంలో 6,556 మంది విద్యార్థులకు రూ.9,83,40,000 సొమ్మును సీఎం తల్లుల ఖాతాలకు విడుదల చేసిందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లులకు నమూనా చెక్కు అందజేశారు. రూ.5 లక్షల మండల పరిషత్ నిధులతో వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ ఆలయం నుంచి గ్రామంలోకి వెళ్లే కాలువగట్టు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.80 లక్షలతో పళ్లాలమ్మ ఆలయ ముఖ మండపం, ఇతర నిర్మాణాల పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి బాబి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు బండారు రాజా, ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వానపల్లిలో అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, వీర్రాజు



అంబాజీపేటలో అమ్మ ఒడి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

విద్యలో నంబర్‌వన్‌గా ఉండాలన్నదే సీఎం ధ్యేయం

అంబాజీపేట: విద్యలో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్‌వన్ స్థానంలో నిలపాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో అమ్మ ఒడి నాలుగో విడత పంపిణీని సోమవారం ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 4883 మంది విద్యార్థులకు గాను రూ.7.32 కోట్లు వారి తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కింద రూ.2 వేలను ప్రభుత్వం పాఠశాలలకు అందజేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానాన్ని దత్తత తీసుకున్న మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, కె.కోటబాబు, ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెంలో ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పెదపేటలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. యువ న్యాయవాది అజ్జరపు రాజ్‌కమల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, చిర్ల జగ్గిరెడ్డి, రిటైర్డ్ జిల్లా జడ్జి అజ్జరపు మేరీగ్రేస్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శిబిరాన్ని వారు ప్రారంభించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాజ్‌కమల్ ఈ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరం డెల్టా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, స్రవంతి డెంటల్, శ్రీనేత్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో అతిథుల చేతుల మీదుగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పలు వ్యాధులకు సంబంధించి సుమారు 200 మందికి వైద్య సేవలు అందించారు.